## క్లుప్తంగా

### ఏక్ సాల్ పట్టాలు ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిజేస్తున్న దృశ్యం

**టి.నరసాపురం:** ఎర్రకాలువ మిగులు భూములు సాగులో ఉన్న పేదలకు ఏక్ సాల్ పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ టి.సాయిబాబాకు అందజేశారు. టి.నరసాపురం మండలంలోని ఎర్రకాలువ మిగులు భూముల్లో గత కొన్నేళ్లగా స్థానిక గ్రామాలకు చెందిన కొందరు పేదలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని పలుమార్లు ఇరిగేషన్ అధికారులు చుట్టూ తిరిగినప్పటికీ పట్టించుకోలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు, మండల కార్యదర్శి మడకం సుధారాణి, మడకం కుమారి, దుర్గమ్మ గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు


విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న దృశ్యం


**కొయ్యలగూడెం:** సీజనల్‌గా విద్యార్థులకు వచ్చే వ్యాధుల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తతో వ్యవహరించాలని ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం పేర్కొన్నారు. గురువారం బయ్యన్నగూడెం పీహెచ్‌సీ పరిధి ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. తరచూ జ్వర పీడిత విద్యార్థులకు రక్త పరీక్షలు తప్పనిసరని అన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత


డ్రైవర్‌కు బ్రీతింగ్ పరీక్ష చేస్తున్న పోలీసులు

**జంగారెడ్డిగూడెం:** పాఠశాలలు కాలేజీ బస్సుల డ్రైవింగ్‌లో సురక్షితంగా ఉండేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్టు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. గురువారం స్థానిక సీఐ ఎం.సుభాష్ ఆధ్వర్యంలో ఎస్సై షేక్ జబీర్, ట్రాఫిక్ ఎస్సై కుటుంబరావులు సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఆటోలు, స్కూల్, కాలేజీ బస్‌ల్లో విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సాధించినట్లు తెలిపారు. డ్రైవర్‌లు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారన్న సమాచారంతో ఈ తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. మద్యం సేవించి వాహనాలను నడపడం అంటే నడిపే వారికే కాకుండా ఇతరుల జీవితాలతో చెలగాటం ఆడటమే అన్న సందేశాన్ని డ్రైవర్లకు తెలియజేశారు. సీఐ సుభాష్ మాట్లాడుతూ పిల్లల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం పోలీస్ శాఖ ప్రధాన కర్తవ్యమని, డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విద్యా సంస్థల యాజమాన్యాలు డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితి, అలవాట్లపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సందర్భంగా అనుమానితులకు బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు.

### అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు


ఎస్సై చెన్నారావు

**కామవరపుకోట:** మండలంలో ఎక్కడైనా అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు హెచ్చరించారు. గురువారం తడికలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల కామవరపుకోటలో చోటుచేసుకున్న ఆస్తుల ధ్వంసం ఘటనలో ఇప్పటివరకు 16 మంది అనుమానితులను అదుపులోకి తీసుకోగా, ఇంకా 9 మంది గుర్తింపు ప్రక్రియలో ఉన్నారని తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వినా, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినా వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే తడికలపూడిలో ఒకటి, కామవరపుకోటలో రెండు ట్రాఫిక్ కేసులు నమోదైనట్టు చెప్పారు. విద్యాలయాల పరిసరాల్లో గుట్కా విక్రయాలను అరికట్టేందుకు దాడులు నిర్విస్తున్నామన్నారు. రాత్రి 7 గంటల తర్వాత కామవరపుకోట పరిసర ప్రాంతాల్లో ఓపెన్ డ్రింకింగ్ చేసే వారిపైనా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటివరకు 45 మంది అదుపులో తీసుకుని కేసులు నమోదు చేశామని వివరించారు.

### ఆశ్రమ పాఠశాలల్లో తనిఖీ

**కుక్కునూరు:** స్థానిక గిరిజన ఆశ్రమ బాలికల, మాధవరం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలను గురువారం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్‌ల బృందం తనిఖీ చేశారు. విద్యాబోధన, మౌలిక వసతులు, భోజనం, విద్యార్థులకు పంపిణీ చేసిన ఎస్ఆర్‌కే కిట్లు, యూనిఫాం పంపిణీపై ఆరా తీశారు. డిప్యూటీ డైరెక్టర్ శ్రీవిద్య, ఏఎంఓ శ్రీనివాస్, డీవైఈఓ కుమార్ పాల్గొన్నారు.

# మందకొడిగా వరి నాట్లు

- మొహం చాటేసిన వర్షాలు
- రైతుల అందోళన


జంగారెడ్డిగూడెం మండలంలో వేసిన వరి నాట్లు

**జంగారెడ్డిగూడెం:** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మందకొడిగా ప్రారంభమైంది. సీజన్ ప్రారంభంలో కొద్ది మేర వర్షాలు పడినప్పటికీ క్రమంగా తగ్గుముఖం పట్టాయి. రైతులు ఖరీఫ్ పనులు ప్రారంభించే నాటికి వర్షాలు ముఖం చాటేయడంతో గ్రామాల్లో వరినాట్లు మందకొడిగా సాగుతున్నాయి. జూలై రెండో వారం గడిచినా ఇప్పటి వరకు 10 శాతం మాత్రమే వరినాట్లు పడ్డాయి. జంగారెడ్డిగూడెం మండలంలో కేకేఎం ఎర్రకాలువ జలాశయానికి చెందిన కాలువల చుట్టు పక్కల కొద్ది మేర వరి నాట్లు వేశారు. వాస్తవానికి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ప్రారంభమైనప్పటికీ ప్రారంభంలో కురిసిన వర్షాలే తప్ప ఆ తరువాత అవి మొహం చాటేశాయి. ముఖ్యంగా జూలై, ఆగస్టు నెలలో వర్షాలు అధికంగా కురుస్తాయి. అయితే జూలై నెల ప్రారంభం నుంచి వర్షం జాడ లేదు. వేసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయి. ఈ నేపథ్యంలో చాలాచోట్ల నారు మడి పోతలు ఆలస్యమవుతున్నాయి. మే ఆఖరి వారం, జూన్ మొదటి వారంలో కురిసిన వర్షాలకు కొద్ది మంది రైతులు చేలల్లో దమ్ములు చేసి వరినాట్లు వేశారు. మిగిలిన రైతులు ఆలస్యంగా నారు మడులు వేయడంతో నారు అందుబాటులో వచ్చేసరికి వర్షాలు లేవు. బోర్లు, కాలువలు ఉన్నచోట వరినాట్లు వేస్తుండగా, మిగిలిన వారు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

**10 శాతం నాట్లే పూర్తి :** వాస్తవానికి జూలై రెండో వారానికే 50 శాతంపైగా వరినాట్లు పూర్తి కావాల్సింది. కేఆర్‌పురం వ్యవసాయ డివిజన్ పరిధిలో నేటికి 10 శాతం మాత్రమే వరినాట్లు పూర్తయ్యాయి. డివిజన్ పరిధిలో వరిసాగు సాధారణ విస్తీర్ణం మొత్తం 22,234 ఎకరాలు కాగా, వీటిలో 2178 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. డివిజన్ పరిధిలో అత్యధికంగా జంగారెడ్డిగూడెం మండలంలో 1256 ఎకరాల్లో, బుట్టాయగూడెంలో 112 ఎకరాలు, కొయ్యలగూడెంలో 120 ఎకరాలు, పోలవరంలో 620 ఎకరాల్లో నాట్లు వేశారు. వెదజల్లే పద్ధతిలో కుక్కునూరులో 70 ఎకరాల్లో వరి పంట వేశారు. జీలుగుమిల్లి, వేలేరుపాడు మండలాల్లో నాట్లు పడలేదు.

**ఇతర పంటలకూ ఆలస్యమే**

డివిజన్ పరిధిలో మొక్కజొన్న 1574 ఎకరాల్లో వేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 67 ఎకరాల్లో మాత్రమే వేశారు. కొయ్యలగూడెం మండలంలో 62 ఎకరాలు, జంగారెడ్డిగూడెం మండలంలో 5 ఎకరాల్లో మొక్కజొన్న వేయగా, బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లిలలో పంట వేయలేదు. పత్తి సాధారణ విస్తీర్ణం 9311 ఎకరాలు కాగా, 2284 ఎకరాల్లో పత్తి పంట వేశారు. కుక్కునూరు మండలంలో 1790 ఎకరాలు, వేలేరుపాడు మండలంలో 315 ఎకరాలు, జీలుగుమిల్లి మండలంలో 170 ఎకరాల్లో పత్తి వేశారు.

### ఎరువులు ఎక్కువగా వాడాలి



వరినాట్లు ఆలస్యమైన నేపథ్యంలో యూరియా ఎరువును కొద్దిగా ఎక్కువగా వినియోగించాలి. సాధారణంగా ఎకరానికి 30 కేజీల యూరియా వినియోగించాల్సి ఉండగా, ప్రస్తుత పరిస్థితుల్లో 50 కేజీలు వినియోగించాలి. నాట్లు పైపైనే నాటుకోవాలి. చదరపు మీటర్‌కు 33 కుదుళ్లు వేసుకోవాలి. కలుపు నివారణకు ప్రిటిలాక్లోర్ ఎకరానికి 400 మి.లీ 20కేజీల ఇసుకలో కలిపి నాటిన 3 నుంచి 5 రోజుల్లో చల్లాలి.

– పీజీ బుజ్జిబాబు, వ్యవసాయశాఖ ఏడీ

### ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన


ఇటికలకోటలో శంకుస్థాపన చేస్తున్న ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసరావు

**పోలవరం రూరల్:** జలజీవన్ మిషన్‌లో భాగంగా మండలంలోని మూడు గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకం ట్యాంకుల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పనులను ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసరావు గురువారం నూతనగూడెం, కమ్మరగూడెం, ఇటికలకోట గ్రామంలో శంకుస్థాపన చేశారు. పోలవరం సర్పంచ్ పాడుం పుష్ప, కొణతాల ప్రసాద్, కరిబండి నాగరాజు, పాదం ప్రసాద్, జల్లేపల్లి నరసింహారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

### 19న ఉచిత నేత్ర వైద్యశిబిరం

**జంగారెడ్డిగూడెం:** ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక చింతల బజారులోని అసోసియేషన్ కార్యాలయంలో ఈనెల 19న ఉదయం 9 గంటల నుంచి ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటుచేశామని జంగారెడ్డిగూడెం ఏపీఎస్‌జీఆర్ఈఏ అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి కె.నాగేశ్వరరావులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రజలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి

వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజయరాజు


ఆడమిల్లిలో ప్రభుత్వం చేస్తోన్న మోసాలను వివరిస్తున్న విజయ రాజు


వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్న నాయకులు

**కామవరపుకోట:** ఎన్నికల హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలు మోసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు ఆరోపించారు. గురువారం మండలంలోని ఆడమిల్లిలో పార్టీ మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ జనసేన, బీజేపీలతో జతకట్టి సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు ఏడాది గడుస్తున్న ఎన్ని హామీలు అమలు చేశారని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులను, నిరుద్యోగ భృతి ఊసే లేదని, ఉచిత బస్సు పేరుతో మహిళను మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబు మొదటి నుంచి మోసాలతోనే ముఖ్యమంత్రి పదవులు చేపట్టారని గుర్తుచేశారు. పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి కుర్చీని లాక్కున్నారని తెలిపారు. 2014లో రైతు రుణమాఫీ అంటూ రైతులను, పసుపు కుంకుమ అంటూ మహిళలను మోసం చేశారని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలతో 2024లో రాష్ట్ర ప్రజలు మోసం చేసి ముఖ్యమంత్రి అయ్యారని, కూటమి నాయకుల మెడలు వంచైన హామీలు నెరవేర్చే విధంగా వారిని నిలదీయాలని అన్నారు.

**పరామర్శలు**

అనంతరం వీరిశెట్టిగూడెంలో ఆవుల ఏలేశు కుటుంబాన్ని, ఆడమిల్లిలో ఇటీవల ఆపరేషన్ చేపించుకున్న చింతపల్లి లక్ష్మణరావును, సిద్ధ బత్తుల రమేష్‌ను, భరతాల చంద్రమ్మ కుటుంబ సభ్యులను, మానెల్లి భారతి కుటుంబ సభ్యులను, జోగడిగూడెంలో బందెల దేవసహాయం కుటుంబ సభ్యులను, కొత్తూరులో అందుగుల వెంకటేశ్వరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆడమిల్లి వద్ద కూలిపోయిన బ్రిడ్జ్ నిర్మాణం వెంటనే చేపట్టాలని స్థానిక నాయకులతో కలిసి విజయరాజు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రీవెన్స్ సెల్ జిల్లాఅధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ, ఆడమిల్లి గ్రామ పార్టీ ప్రెసిడెంట్ భీమేశ్వరావు, వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహనరావు, ఎంపీటీసీ బొప్పన చైతన్య సొసైటీ మాజీ అధ్యక్షులు గుర్రాల రవి, కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ నానది సాగర్, సీనియర్ నాయకులు వెర్రి శ్రీను బాబు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, వేముల సాయి, కొమ్మిన నరేష్, మద్ది రామయ్య, రుద్రపాక నాగ మల్లేశ్వరావు, చింతపల్లి సుధా, కాట్రూ యేసు, తానేటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

### వికలాంగుడికి చేతి కర్రలు అందజేత


వికలాంగుడికి చేతికర్రలు అందిస్తున్న దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** స్థానిక బాలాజీ నగర్‌కు చెందిన వికలాంగుడు తానేటి వీర్రాజుకు దాతల సహకారంతో జంగారెడ్డిగూడెం డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చేతికర్రలు గురువారం అందజేశారు. సంఘ వ్యవస్థాపకులు అమృతల రంగా మాట్లాడుతూ తాపీ పని చేసే వీర్రాజు ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో ఇబ్బంది పడుతున్నాడని, ఆయన్ని దాతలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకర్‌రావు, కార్యదర్శి పటాన్ బాజీ, ఉపాధ్యక్షుడు లింగంకుంట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**టి.నరసాపురం:** టి.నరసాపురం, బొర్రంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

**చింతలపూడిలో..**

**చింతలపూడి:** శంఖుచక్రపురం, వెలగలపల్లి సబ్‌స్టేషన్లకు, పట్టాయిగూడెం, సీతానగరం ఫీడర్లు, చింతలపూడి టౌన్ ఫీడర్ పరిధిలోని గాంధీ నగర్, గణేష్ కాలనీ, పాతచింతలపూడి, సమ్మెటవారిగూడెం, ఎస్‌బీఐ నగర్, మోడల్ కాలనీ, బోయగూడెం, వెంకట్రామబాగ్, తుక్కుల కాలనీ, రేచర్ల 24 గంటల ఫీడర్, రేచర్ల ఏజీఎల్ ఫీడర్ల పరిధిలో 18 శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

**జంగారెడ్డిగూడెంలో..**

**జంగారెడ్డిగూడెం:** శుక్రవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాజులకాలనీ, రామచంద్రాపురం ప్రాంతాల్లో, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మైసన్నగూడెం, శ్రీనివాసపురం, పుల్లేపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

**కొయ్యలగూడెంలో..**

**కొయ్యలగూడెం:** శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరింపూడి, గవరవరం, అంకాలగూడెం, బోడిగూడెం, మంగపతిదేవిపేట, శ్రీరంగపట్నం, అచ్యుతాపురం గ్రామాలకు వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈఈ పీర్ అహ్మద్ పేర్కొన్నారు.

**పోలవరంలో..**

**పోలవరం రూరల్:** శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పోలవరం మండలం వింజరం, ప్రగడపల్లి, ఎల్ఎన్‌డీపేట, చేగొండిపల్లి, పంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

# అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ


నూకాలమ్మకు సారె తెస్తున్న మహిళలు


పతువులమ్మకు సారె తీసుకెళుతున్న గ్రామస్తులు

**జంగారెడ్డిగూడెం:** ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక బుట్టాయగూడెం రోడ్డులో పద్మ థియేటర్ ఎదురుగా ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ కమిటీ, శ్రీ షణ్ముఖ వారాహి భక్త బృందం ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, పూలు, పండ్లు వివిధ రకాల మధుర పదార్థాలతో సారె సమర్పించారు. మహిళలు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం నుంచి నూకాలమ్మ ఆలయానికి శోభాయాత్రగా వెళ్లి సారెను అందజేశారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మూడేళ్లుగా గ్రామ దేవతలకు సారె సమర్పిస్తున్నట్టు శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రధాన అర్చకులు కురెళ్ల రాంబాబు శర్మ తెలిపారు. కార్యక్రమంలో నూకాలమ్మ ఆలయ శాశ్వత చైర్మన్ రాజాన సత్యనారాయణ (పండు), ఆలయ కమిటీ అధ్యక్షులు రొంగల నాగేశ్వరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**నేడు కనకదుర్గమ్మకు సారె సమర్పణ**

జంగారెడ్డిగూడెం ఆటోనగర్ నందు గల కనక దుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం సారె, చీర సమర్పించనున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 9.30 గంటలకు రామచంద్రాపురంలోని నూతన రామాలయం నుంచి శోభాయాత్రగా ప్రారంభమవుతుందని తెలిపింది.

**దత్తాత్రేయునికి పూజలు :** జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో కొలువైన దత్తాత్రేయునికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**బయ్యన్నగూడెం గ్రామదేవతకు సారె**

**కొయ్యలగూడెం:** బయ్యన్నగూడెం గ్రామ దేవత శ్రీపతువులమ్మవారికి గురువారం గ్రామస్తులు ఆషాఢం సారె సమర్పించారు. మహిళలు ఏకవస్త్ర ధారణతో సరిపల్లి రోడ్డులోని ఆలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సారే కావిడులు మోస్తూ ఆషాఢం పెళ్లికొడుకులు మహిళల వెంట తరలివెళ్లారు. సాంప్రదాయాలను భావితరాల వారికి అందించడానికి తమ గ్రామం ఎప్పుడు ఆదర్శంగా నిలుస్తుందని వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు.

### డీఈఓ హామీతో దీక్షల విరమణ


నిమ్మరసం ఇచ్చి రిలే దీక్ష విరమింపజేస్తున్న దృశ్యం

**కుక్కునూరు:** మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోరుతూ రెండు రోజులుగా నిర్వహిస్తున్న రిలే దీక్షలను గురువారం విరమించారు. ఈ శిబిరంలో ఏఎంఓ శ్రీనివాసరావు నాయకులతో చర్చించారు. డీఈఓతో ఫోన్‌లో మాట్లాడించారు. డిప్యూటేషన్ పద్ధతికి సంబంధించి ఇప్పటికే పనులు ప్రారంభించామని డైరెక్టర్‌తో మాట్లాడి విద్యావలంటీర్‌లను కూడా నియమిస్తామని డీఈఓ హామీ ఇవ్వడంతో నాయకులు దీక్షను విరమించారు. దీక్షలో సీపీఎం, సీపీఐ నాయకులు బుయ్యన శ్రీను, వై.నాగేంద్రరావు, కొన్నె లక్ష్మయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు రాయి సత్యనారాయణ, మల్లెల చంటినాయుడు, సీఐటీయూ నాయకులు యర్నం సాయికిరణ్, కాంగ్రెస్ నాయకులు గజ్జి రాజులు, వడ్డే రఘు, మడకం వీరయ్య పాల్గొన్నారు.

## పశు వైద్యశాలల తనిఖీ


కొయ్యలగూడెంలో ఔషధాల తనిఖీ చేస్తున్న డీడీ

**జంగారెడ్డిగూడెం:** పశుసంవర్థక శాఖ నూజివీడు డివిజన్ ఉపసంచాలకులు జి.రమేష్ జంగారెడ్డిగూడెం ప్రాంతీయ పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. లక్కవరం, కొయ్యలగూడెం, దిప్పకాయలపాడు, యర్రంపేట పశువైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు పీఎస్‌వీఎస్ దొర, పశు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**వెటర్నరీ డీడీ తనిఖీ**

**కొయ్యలగూడెం:** పశుసంవర్థక శాఖ డీడీ జి. రమేష్, డాక్టర్ కె.మహేంద్ర కొయ్యలగూడెం పశువుల హాస్పిటల్‌ను గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. మందులు, వ్యాక్సిన్లు, ఆసుపత్రి రిజిస్టర్లను పరిశీలించారు. స్టాకు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముద్ద చర్మవ్యాధి నివారణకు గోట్ ఫాక్స్ వైరస్ వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచాలని పశువైద్య శాఖ అధికారి బీఆర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

## ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టిన ట్రాక్టర్

**ద్వారకాతిరుమల:** మండలంలోని రామన్నగూడెంలో ఒక ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో ప్రధాన రహదారిపై వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రక్కు పక్కకు పడిపోగా, విద్యుత్ స్తంభం ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని నిలిచింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**చింతలపూడి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 – 26 విద్యా సంవత్సరానికి ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులను రెన్యువల్ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-2లో 178 పోస్టులకు రెన్యువల్ చేస్తామని, 2024 – 25 విద్యా సంవత్సరంలో 2025 ఏప్రిల్ 30 నాటికి ఒప్పంద అధ్యాపకులుగా పనిచేసిన వారే అర్హులని పేర్కొన్నారు. ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## హాస్టల్‌ను పునఃప్రారంభించాలని వినతి


జేసీకి వినతిపత్రం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

**కుక్కునూరు:** అమరవరం సాంఘీక సంక్షేమ వసతి గృహాన్ని పునఃప్రారంభించాలని కోరుతూ పూర్వ విద్యార్థులు గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ వసతిగృహంలో చదువుకున్న ఎందరో విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. 1967లో ఎమ్మెల్సీ తోటకూరి వెంకటప్పయ్య సహకారంతో ప్రారంభించిన వసతి గృహం 2014వ సంవత్సరం వరకు కొనసాగిందని తెలిపారు. దీనిని ముంపు ప్రాంతమన్న పేరుతో ఉన్నతపాఠశాలగా మార్చారని వివరించారు. హాస్టల్ లేకపోవడంతో సుమారు 34 గ్రామాల విద్యార్థులు వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ మేరకు కలెక్టర్, జేసీలను కలిసి వినతి ప్రతం అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెంటాల వెంకట్, ఇల్లంగి చిట్టిబాబు, చింతమల్ల కాంతారావు, తోటమళ్ల వెంకట్, బుయ్యన నాగేశ్వరావు, మేకా ఈశ్వరయ్య, శనగ వెంకటేశ్వర్లు, శనగ రామచందర్‌రావు తదితరులు ఉన్నారు.

### శ్రీవారి సేవలో కేంద్ర మంత్రి

**ద్వారకాతిరుమల:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయాన్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం సందర్శించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో కలసి ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం ఈఓ ఎన్‌వీ సత్యనారాయణమూర్తి, ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు, అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు.

## ముస్లింలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలి

**బుట్టాయగూడెం:** ముస్లింలు ఆర్థికంగా, సామాజికంగా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ముస్లింల జంగారెడ్డిగూడెం జేఏసీ సభ్యులు షేక్ ముస్తఫా తెలిపారు. బుట్టాయగూడెం మసీదులో గురువారం రాత్రి మసీదు పెద్దలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ముస్లింలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో డిగ్రీ చదివిన వాళ్లలో ముస్లింలు మూడు శాతం మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉద్యోగాల్లో చాలా తక్కువ మంది ఉన్నారని చెప్పారు. రాజకీయంగా కూడా బాగా తక్కువ మంది ఉన్నారని వివరించారు. ప్రతి ముస్లిం తప్పనిసరిగా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. కార్యక్రమంలో హిమామ్, బాజీ, తదితరులు పాల్గొన్నారు.

**విద్యతోనే ముస్లింల అభివృద్ధి**

**జంగారెడ్డిగూడెం:** ముస్లిం సమాజం అన్నిరంగాల్లో సమష్టిగా అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించాలని స్థానిక ముస్లిం జేఏసీ సభ్యులు షేక్ ముస్తఫా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం మసీద్‌లో లక్కవరం, దేవులపల్లి, రావికంపాడు, పంగిడిగూడెం మసీదు పెద్దలతో జేఏసీ సభ్యులు గురువారం సమావేశం లక్కవరం ఫరూఖీ మస్జిద్ అధ్యక్షులు పఠాన్ అన్వర్ భాష అధ్యక్షతన నిర్వహించారు. ముస్లింల అభివృద్ధి, విద్య ఆవశ్యత, రాజకీయ ప్రాధాన్యత తదితర అంశాలపై గత ఐదు రోజులుగా సమావేశాలు నిర్వహిస్తున్నట్టు ముస్తఫా తెలిపారు.